క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కాకరాపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై శంకర్

కోటనందూరు: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎస్సై శంకర్ హెచ్చరించారు. మండలంలోని కాకరాపల్లి కనకదుర్గ ఆలయం వద్ద గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించని, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. హెల్మెట్, సీటుబెల్ట్ విధిగా ధరించాలని వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో పేదలకు మేలు

ప్రత్తిపాడు రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని బీజేపీ కాకినాడ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెంకటనగరంలో బీజేపీ మండలాధ్యక్షుడు కంద వీరాస్వామి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ కో కన్వీనర్ దాకే కృష్ణారావు, జిల్లా సైనిక్ సెల్ కన్వీనర్ కర్రి ధర్మరాజు, శెట్టి గంగ బాబు, తోలేటి రాంబాబు, పెట్లు కొండబాబు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గోకవరం: ఎంపీపీ సుంకర శ్రీవల్లి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం గోకవరంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు గురువారం తెలిపారు. స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీ, వైఎస్సార్ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ప్రారంభిస్తారన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన డెల్టా ఆస్పత్రి వైద్య సిబ్బంది రోగులకు వైద్య సేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. మండల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు.

తునిలో కంటి వైద్య శిబిరం

తుని: స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తునిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వాకర్స్ హెల్త్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు డీఎస్ మూర్తి గురువారం తెలిపారు. స్థానిక కొత్తపేట సత్యసాయి మందిరంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రోగులకు కంటి పరీక్షలు చేస్తారన్నారు. కంటి శుక్లాలకు ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బంద్ పోస్టర్ ఆవిష్కరణ

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారత న్యాయ సంహిత-2023 చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం నిర్వహించే దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల నాయకుడు పాకలపాటి సోమరాజు కోరారు. పట్టణంలో గురువారం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్లు, ఆపరేటర్లకు నష్టం కలిగించే భారత న్యాయ సంహిత చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. కేంద్రం ప్రభుత్వం వైఖరికి నిరసనగా చేపట్టనున్న బంద్‌కు వాహనదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు రొంగల ఈశ్వరరావు, వెంకటేష్, సురేష్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పొగమంచుతో ఇక్కట్లు



కోటనందూరులో కురుస్తున్న మంచు

కోటనందూరు: పల్లెల్లో ప్రతిరోజూ తెల్లవారు జామున పొగమంచు కురుస్తోంది. ఉదయాన్నే పనులకు వెళ్లే ప్రజలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ఒకవైపు ఆహ్లాదపరుస్తూ మరోవైపు ఇబ్బందులకు గురి చేస్తోంది. ఉదయం 8 గంటల వరకూ కురుస్తున్న మంచుతో వాహనదారులు లైట్ల వెలుగులోనే నిదానంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా పూతమీద ఉన్న మామిడి, జీడి మామిడి తోటలకు ఈ మంచుతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన మాసోత్సవాలు

కాకినాడ సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రహదారి భద్రతా మాసోత్సవాలు గురువారంతో ముగిశాయి. స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ ఎంయూవీ మనోహర్ ఆధ్వర్యంలో ముగింపు సభ నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, జిల్లా ప్రాంతీయ రవాణా అధికారి పీవీ సాయి ప్రసాద్, కాకినాడ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్‌రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రోడ్డు భద్రతా నియామాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

గిరిజనుల కష్టాలకు చెక్

- శంఖవరం-వేళంగి రహదారికి మోక్షం
- సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించిన వరుపుల సుబ్బారావు
- తీరనున్న ఏజెన్సీ ప్రజల కష్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న 25 గ్రామాల గిరిజనులు



వేళంగిలో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, వరుపుల సుబ్బారావు



రాళ్లు పైకి లేచిపోయి అధ్వానంగా ఉన్న శంఖవరం-వేళంగి రహదారి

శంఖవరం: ఎన్నో ఏళ్లుగా అస్తవ్యస్తంగా ఉన్న రహదారిపై అడుగుతీసి అడుగు వేయడానికి గిరిజనులు అష్టకష్టాలు పడ్డారు. మండలకేంద్రమైన శంఖవరం నుంచి వేళంగి వరకూ ఉన్న ప్రధాన రహదారి 2004కు ముందే శిథిలమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రభుత్వాలు మారిన రహదారికి మాత్రం మోక్షం కలగలేదు. దీంతో ఈ రహదారిపై ప్రయాణించేందుకు ప్రజలు నరకం చూశారు. రహదారిని పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రజలు లెక్కకు మించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. మండలస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులకు వినతి పత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదు. ఇక తమ రహదారి పునర్నిర్మాణం జరుగుతుందని ఆశలు వదులుకున్నారు.

వర్షం వస్తే అంతే సంగతులు

శంఖవరం నుంచి వేళంగి వరకు రహదారి గోతులు పడి అస్తవ్యస్తంగా తయారైంది. ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. దారి పొడవున ఏర్పడిన భారీ గోతుల్లో వర్షం నీరు చేరి తరచూ ప్రమాదాలు జరిగేవి. వాహనాలు మరమ్మతులకు గురయ్యేవి. దీంతో ఆటోవాలాలు, వాహచోదకులు తీవ్రంగా నష్టపోయేవారు. కాగా ఈ రహదారి నిర్మాణానికి గత పాలకులు పలుమార్లు శంకుస్థాపనలు చేసినా పనులు చేపట్టలేదు.

సమయానికి వైద్యం అందక...

శంఖవరం మండలంలోని సుమారు 20పైగా గిరిజన గ్రామాల ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం శంఖవరం, కాకినాడ, తుని, రాజమహేంద్రవరం ప్రధాన పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. కాగా గిరిజన ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లే ఈ రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో నిర్దిష్ట సమయంలో వైద్య సేవలు అందక మార్గమధ్యలో పలువురు ప్రాణాలు కోల్పోయారు.

రూ.6.6 కోట్లు మంజూరు

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు మండలంలోని జి.కొత్తపల్లి, గౌరంపేట, పి.మల్లాపురం, వేళంగి పంచాయతీ గ్రామాల్లో పర్యటించారు. ఈ క్రమంలో ఆ గ్రామాల ప్రజలు రహదారి సమస్యను వరుపుల సుబ్బారావు దృష్టికి తీసుకువచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రహదారి సమస్యను పరిష్కరిస్తానని ఆయన గిరిజన ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం అధికారులతో సమీక్షించి రహదారి సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి రూ.6.6 కోట్లు ఎన్ఆర్‌జీఎస్ నిధులు మంజూరు చేశారు.

రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన

శంఖవరం నుంచి వేళంగి వరకూ 20 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణ పనులకు ఈ నెల 9న ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్‌తో కలిసి నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం రహదారి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రహదారికి నిర్మాణ పనులు చేపట్టారని పూర్తిగా ఆశలు వదులుకున్న తరుణంలో పునర్నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం జగన్ చొరవతో రహదారి నిర్మాణం



గిరిజనుల రహదారి సమస్యను సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే రహదారి నిర్మాణ పనులకు రూ.6.6 కోట్లు ఎన్ఆర్‌జీఎస్ నిధులు మంజూరు చేశారు. గతంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా, నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ రహదారిని నిర్మాణ పనులు చేశాం. మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రహదారి పునర్నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేశారు.

– వరుపుల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, ప్రత్తిపాడు

గిరిజనులకు ఎంతో మేలు



శంఖవరం-వేళంగి రహదారి పునర్నిర్మాణ పనులు చేపట్టడంతో గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తయితే గిరిజనుల విద్య, వైద్య సేవలకు ఇబ్బంది ఉండదు. రైతులు తమ పంటలను పట్టణాలకు తీసుకువెళ్లి అమ్ముకోవచ్చు. దీర్ఘకాలంగా ఉన్న రహదారి సమస్యకు సీఎం జగన్, కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు చొరవతో పరిష్కారం లభించడం ఆనందంగా ఉంది.

– ఈగల విజయదుర్గ, జి.కొత్తపల్లి సర్పంచ్, శంఖవరం మండలం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



ఎన్నో ఏళ్లుగా ఛిద్రమైన వేళంగి-శంఖవరం రహదారి నిర్మాణ పనులు చేపట్టడుతున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. ఎన్నో ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేసినప్పటికీ గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. గిరిజనుల సమస్యలను గుర్తించిన ప్రభుత్వం రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవడం అభినందనీయం.

– పెయ్యల కొండబాబు, గిరిజనుడు,వేళంగి

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ

కిర్లంపూడి: బాల్య వివాహాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఎం.పూర్ణిమ హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం వీఓఎస్, వీఏఎస్‌లకు బాల్య వివాహాల నిర్మూలన చట్టం, బాల,బాలికల హక్కులపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు చిన్న వయసులోనే వివాహాలు చేయడంతో శారీరక, మానసిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమాజంలో బాలబాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ అధికారి కె.శ్రీనివాసరావు, కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఏపీఎం ఇనకోటి శ్రీనివాస్, రవి కుమార్, ఆర్.రవికుమార్, జి.సునీత, కరీంమున్నీషా, బూసమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పెరుమాళ్లపురంలో పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించిన డీఈఓ రమేష్

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రెండో విడత నాడు-నేడు పనులను జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ గురువారం పరిశీలించారు. పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం భోజనం అమలు తీరును, పలు రికార్డులను తనిఖీ చేశారు.అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షించారు.

దళితుల సంక్షేమానికి ప్రభుతం కృషి

- ఎమ్మెల్సీ అనంతబాబు, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ వరుపుల
- జె.అన్నవరంలో జిరాయితీ భూములకు పట్టాల పంపిణీ



జె.అన్నవరంలో లబ్ధిదారులకు పట్టాలు ఇస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, కో ఆర్డినేటర్ వరుపుల

ఏలేశ్వరం: దళితుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని జె.అన్నవరంలో గురువారం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 161 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 50 సెంట్ల చొప్పున 83 ఎకరాల జిరాయితీ భూమికి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. జె.అన్నవరంలో పెండింగ్‌లో ఉన్న పట్టాలను లబ్ధిదారులకు అందజేసినట్టు చెప్పారు. అన్ని వర్గాలకూ మేలు చేస్తున్న సీఎం జగన్‌కు మళ్లీ ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కొండపల్లి వెంకటేశ్వరరావు, కాలారి సత్తిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కాలారి గిరీష, కాకరపల్లి వీరంశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- గుమ్మరేగులలో గడప గడపకూ మన ప్రభుత్వం



గుమ్మరేగులలో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న వరుపుల సుబ్బారావు

రౌతులపూడి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని గుమ్మరేగులలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాపర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రౌతులపూడి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర సుమారు మూడు కిలోమీటర్ల మేర గుమ్మరేగుల వరకూ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందన్నారు. గ్రామ ప్రజల ఆదరాభిమానాలు చూస్తుంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీని గెలిపించడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరుశాతం నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ నేత వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, పార్టీ నాయకులు కాకి నాని, రాయి ప్రసాద్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు రుత్తల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న వరుపుల

రౌతులపూడి: మండలంలోని రౌతులపూడి, బలరామపురం గ్రామాల్లో గురువారం జరిగిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు పాల్గొన్నారు.

తంటికొండ వెంకన్నకు ప్రత్యేక పూజలు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

గోకవరం: మండలంలోని తంటికొండలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, చతుర్దశ కలశారాధన, పంచామృత మండపారాధన, పూర్ణాభిషేకం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి) దంపతులు గోపూజ చేశారు. అనంతరం స్వామివారికి లక్షతులసీ పూజ, కుంకుమార్చన, మహాశాంతి హోమం, స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

నేడు రథసప్తమి వేడుకలు

తంటికొండ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక పాలు పొంగించే కార్యక్రమం, సూర్యనమస్కారాలు, సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈఓ గండి వెంకటలక్ష్మీకుమార్ తెలిపారు.

జి.కొత్తపల్లిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

శంఖవరం: గ్రామంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు సర్పంచ్ ఈగల విజయదుర్గ తెలిపారు. మండలంలోని జి.కొత్తపల్లిలో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య సిబ్బంది డ్రైనేజీల్లో పూడిక, వ్యర్థాలు తొలగించారు. రోడ్లను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు తమ ఇళ్లలోని వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరుచేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలని కోరారు



జి.కొత్తపల్లి డ్రైనేజీలో పూడిక తీస్తున్న దృశ్యం

ఆలయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో పునర్నిర్మించిన నూకాలమ్మ అమ్మవారి ఆలయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 18న రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, లక్ష్మీచైతన్య దంపతులతో ఆలయ ప్రవేశం, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

రత్నగిరిపై నేడు రథసప్తమి వేడుకలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు గురువారం తెలిపారు. సత్యదేవుని వార్షిక కల్యాణ వేదికపై ఉదయం 8.30 గంటలకు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, వివిధ భంగిమల్లో నమస్కారాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఘనంగా కొండరాజులబాబు జాతర

ఏలేశ్వరం: మండలంలోని రమణయ్యపేటలో గురువారం కొండరాజులబాబు జాతర ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఏజెన్సీ ప్రాంతం నుంచి వందలాదిగా భక్తులు తరలి వచ్చారు. జాతరలో వేట్లపాలెం వారితో కోయ డ్యాన్స్, డప్పుల మేళం, కోనారి చువారి డ్యాన్స్, మ్యూజిక్ బ్యాండ్, లక్కగుర్రాలు, కొమ్ములాట, వెలుగుబందవారితో గరగ నృత్యం, రమణయ్యపేట యూత్ వారితో డ్యాన్స్‌బేబి డ్యాన్స్, బాణసంచా కాల్పులు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులకు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం స్వామివారి తీర్థం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రత్తిపాడు రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. మండలంలోని ఉత్తరకంచి, లంపకలోవ, చినశంకర్లపూడి, పెద్దిపాలెం, శాంతిఆశ్రమం, పోతులూరు, వాకపల్లి, యూజే పురం, గజ్జనపూడి, శరభవరం, పోదురుపాక గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

తొండంగి మండలంలో...

తొండంగి: మండలంలోని అన్నయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పైడికొండ, అన్నయ్యపేట, జీఎంపేట, ఆనూరు, వేమవరం, అద్దరిపేట గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

మత్స్యకారుల ఆందోళన

తొండంగి: తీరప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా మండలంలోని ఒంటిమామిడిలో గురువారం మత్స్యకారులు ఆందోళన చేశారు. తీర ప్రాంత మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన మత్స్యకారులు శాంతియుతంగా నిరసన తెలిపారు. తీరంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో కాలుష్యం పెరిగి తమ జీవనోపాధి దెబ్బతింటోందన్నారు. మత్స్యకార కుటుంబాలకు న్యాయం చేయాలని, తీర గ్రామాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- మర్రిపాకలో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని మర్రిపాకలో వైఎస్సార్ సీపీ నేత గట్టి సతీష్, గ్రామ సర్పంచ్ జగతం ఆనందరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ, గ్రామ వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ముంగిటకే పాలనను తీసుకువచ్చారన్నారు. గత ప్రభుత్వాల పాలనలో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.తొలుత తోట నరసింహం తనయుడు తోట రాంజీ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ నేతలు అత్తులూరి సాయిబాబు, గఫూర్, తులా రాము, కె.పైడియ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ సమన్వయకర్త సునీల్
- జగ్గంపేట, ఇర్రిపాకలో పర్యటన



జగ్గంపేటలో సునీల్‌కు స్వాగతం పలుకుతున్న ఒమ్మి రఘురాం, నాయకులు

జగ్గంపేట: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ సమన్వయకర్త చలమలశెట్టి సునీల్ సూచించారు. గురువారం జగ్గంపేట వచ్చిన ఆయనకు వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. జగ్గంపేటలో వైఎస్సార్ విగ్రహానికి సునీల్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోవాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. తనను కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పెద్దాడ రాజబాబు, ముత్యాల శ్రీనివాస్, కాపారపు ప్రసాద్, గొల్లపల్లి శ్రీను, ఆకుల శ్రీధర్, చెరుకూరి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇర్రిపాకలో ఎమ్మెల్యే చంటిబాబును కలిసిన సునీల్

చలమలశెట్టి సునీల్ జగ్గంపేట నుంచి నేరుగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు స్వగ్రామం ఇర్రిపాక వెళ్లారు. అక్కడ ఎమ్మెల్యే చంటిబాబు, అతని తండ్రి జ్యోతుల రామస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు.

పార్టీ విజయానికి కృషి చేయండి



యల్లమిల్లిలో స్వామివారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గండేపల్లి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జగ్గంపేట నియోజవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం పిలుపునిచ్చారు. మండలంలోని యల్లమిల్లి కృష్ణాలయంలో గురువారం తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, పి.నాయకంపల్లి జేసీఎస్ గ్రామ కన్వీనర్ మలిరెడ్డి పాపారావు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, సూరంపాలెం మాజీ సర్పంచ్ కుంచే చినబాబు తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



సొసైటీ నూతన కార్యవర్గాన్ని పూలమాలతో సన్మానిస్తున్న వరుపులు సూరిబాబు

ప్రత్తిపాడు రూరల్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని లింగంపర్తి సొసైటీ చైర్మన్ వరుపుల సూరిబాబు అన్నారు. మండలంలోని ధర్మవరంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఘనంగా జరిగింది. సొసైటీ అధ్యక్షుడిగా జువ్వల బాబులు, సభ్యులుగా బొల్లు వెంకటేశ్వరరావు (నాని), కిలాడి బాబ్జి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వరుపుల సూరిబాబు మాట్లాడుతూ రైతులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా నూతన కార్యవర్గ సభ్యులు పనిచేయాలన్నారు. సొసైటీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, సొసైటీ మాజీ అధ్యక్షుడు జువ్వల చినబాబు, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దళే చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, ఒమ్మంగి సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, పార్టీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, సర్పంచులు బెంతుకుర్తి సుజాత అబ్బాయి, గొనగాల అప్పలరాజు, బొండి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.